క్లుప్తంగా

వీఎంఆర్‌డీఏ పార్క్‌లో మరమ్మతులు



వాకర్లతో చర్చిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

ఏయూక్యాంపస్: పర్యాటకులు, వాకర్లకు మరింత ఉపయుక్తంగా నిలిచే విధంగా వీఎంఆర్‌డీఏ పార్క్‌ను అభివృద్ధి చేస్తామని కమిషనర్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ అన్నారు. బుధవారం ఉదయం మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్లతో మాట్లాడారు. పార్క్‌లో పలు నిర్వహణ సంబంధమైన పనులు ఉన్నాయని, వాటి మరమ్మతులను మూడు వారాల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి చేసామని, త్వరలో మిగతా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. పర్యటనలో ప్రధాన ఇంజినీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ భవానీ శంకర్, డీఎఫ్‌వో సుజాతా శివానీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: విశాలాక్షినగర్ 33/11 సబ్ స్టేషన్ పరిధిలోని చలపతినగర్ ఫీడర్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-3 ఈఈ బి.సింహాచలం నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, చలపతినగర్, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, సంజీవినగర్, ఎస్సీ, ఎస్టీ కాలనీ, బీవీకే కాలేజీ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

బీచ్ రోడ్డులో వెండి వినాయకుడు



పూజా కార్యక్రమాలతో వినాయక ఉత్సవాలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో భారీ వినాయకుడిని నెలకొల్పుతున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దాదాపు రెండు టన్నుల జర్మన్ సిల్వర్‌తో వినాయక విగ్రహాన్ని తయారు చేసి ప్రతిష్టించనున్నారు. బీచ్ రోడ్డులోని ఏపీఐఐసీ మైదానంలో బుధవారం ఉదయం పూజా కార్యక్రమాలను నిర్వాహకుడు సీరపు కనకరాజు నిర్వహించారు. వినాయక మందిరం బయట భారీగా టీటీడీ తరహాలో సెట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పశ్చిమ బెంగాల్, ఒడిశాకు చెందిన కళాకారులు దీనిని సిద్ధం చేస్తున్నారన్నారు. యూత్ ఐకాన్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో గతంలో చాక్లెట్ గణేష్ విగ్రహం ఏర్పాటు చేశామని, గతేడాది అయోధ్య రామ మందిరం సెట్ వేసి ప్రతిష్టించిన బాల గణపతి ని అందరూ దర్శించుకున్నారన్నారు. ఈ ఏడా ది వెండి వినాయకుడిని ప్రతిష్టించి విశాఖ వాసులకు దర్శనం కలిపిస్తామన్నారు. కుటుంబ సమేతంగా వచ్చి స్వామిని దర్శించుకోవాలని కోరారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని అన్న క్యాంటీన్‌ను బుధవారం రాత్రి జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సందర్శించారు. క్యాంటీన్‌లో రాత్రి భోజనాలు, సదుపాయాలు, పరిశుభ్రతను పరిశీలించారు. పలువురు వినియోగదారులతో మాట్లాడి రుచికరమైన భోజనం అందుతుందా లేదాని కమిషనర్ ఆరా తీశారు. అనంతరం టీటీడీ కూడలి సమీపంలో వీధిలైట్ల పనితీరు, సీసీఎంఎస్ బాక్సులను పరిశీలించారు. వీధిలైట్ల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అక్కడి మాంసం విక్రయ దుకాణాన్ని పరిశీలించి వ్యాపారం ఎలా జరుగుతుంది, వ్యర్థాలను ఎలా తరలిస్తున్నారని ఆరా తీశారు. జోన్-3 కమిషనర్ శివప్రసాద్, ఈఈ గంగాధర్, ఏఎంహెచ్‌వో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచాలి

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన ఉన్న అన్న క్యాంటీన్‌ను బుధవారం జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్‌కుమార్ జోన్-2 జెడ్సీ కనకమహాలక్ష్మి, శానిటరీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. క్యాంటీన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, ఎలాంటి చెత్త లేకుండా ప్రతి రోజూ శుభ్రం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీని ఆదేశించారు. ఆహారం రుచికరంగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు.

ఆటోల వలయంలో మద్దిలపాలెం

- అడ్డదిడ్డంగా పార్కింగ్
- వాహన చోదకుల ఇక్కట్లు
- ట్రాఫిక్ సమస్యతో సతమతం







మద్దిలపాలెం ప్రధాన రహదారిలో అడ్డంగా ఆటోలు

మద్దిలపాలెం: మద్దిలపాలెం ఆటో వలయంలో చిక్కుకుపోతోంది. ఇక్కడి ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదురుగా ఇష్టానుసారంగా ఆటోలు నిలిపేస్తున్నారు. దీంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతే కాకుండా రోడ్లపై అడ్డదిడ్డంగా ఆటోలను ఆపి సర్వీసులు చేసుకుంటున్నారు. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టేషన్‌కు వెళ్లడానికి వీల్లేకుండా ఆటోలను రోడ్డుపై అడ్డంగా నిలిపేస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇదేంటని అడిగితే వాదోపవాదాలకు దిగుతున్నారని పేర్కొంటున్నారు.

బస్టేషన్‌కు దారి లేకుండా అడ్డంగా ఆటోలు..

మద్దిలపాలెం బస్‌స్టేషన్ నుంచి బయటికి వచ్చే బస్సులు, లోపలికి వెళ్లే ప్రయాణికుల రాకపోకలకు వీల్లేకుండా ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలిపేస్తున్నారు. దీంతో బస్సులు బస్‌స్టేషన్ నుంచి బయటికి వచ్చే క్రమంలో ట్రాఫిక్ సమస్య నెలకుంటోంది. ఈ క్రమంలో చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్నాయి.

తరుచూ ప్రమాదాలు..

బస్‌స్టేషన్ ముందు ఇష్టారాజ్యంగా ఆటోలు నిలిపి సర్వీసుల కోసం పోటీ పడుతున్న ఆటోవాలాల కారణంగా ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. బస్టేషన్ నుంచి బస్సులు వస్తున్న సమయంలో ఆటోలు అడ్డంగా ఉండడంతో వాటిని దాటుకుంటూ వాహనాలు వెళ్తున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. బుధవారం ఇదే బస్టేషన్ వద్ద ద్విచక్ర వాహనం నడుపుతున్న మహిళ పిల్లలతో సహా ప్రమాదానికి గురయ్యారు. ఇష్టం వచ్చినట్టు నిలిపేస్తున్న ఆటోలను కట్టడి చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఆర్టీసీ ఆదాయానికి గండి..

ఆటోలను బస్టేషన్ చుట్టూ నిలిపి సర్వీసులు చేస్తుండడంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. ఇక్కడి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోవడానికి ఆటో డ్రైవర్లు పోటీ పడుతున్నారు. ఇదే ప్రాంతంలో శ్రీకాకుళం, విజయనగరం ప్రయాణికులను పిలిచి మరీ టాటా ఏస్ డ్రైవర్లు సర్వీసులు చేసుకుంటున్నారు. దీంతో ఆర్టీసీ బస్సుకంటే ముందుగానే గమ్యం చేరడానికి కొందరు ప్రయాణికులు ఆ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి..

ఆటోలను ఎక్కడికక్కడ రోడ్లపై నిలిపి సర్వీసు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ సమస్య పరిష్కారానికి ఆటోలను క్రమపద్ధతిలో నిలుపుదల చేసేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలు తొలగించారు..

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో పారిశుధ్య సిబ్బంది పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ కాలనీలో నివాసాల మధ్య పిచ్చి మొక్కలు మొలిచాయి. ఇక్కడ ఎక్కువ భాగం సీతకొండను ఆనుకొని ఉన్న నివాసాల వద్ద దట్టంగా పిచ్చి మొక్కలు ఉండటంతో పాములు, ముళ్ల పందులు సంచరిస్తూ ఇళ్లలోకి చేరుతున్నాయి. దీనిపై ఈనెల 29న సాక్షిలో ప్రచురించిన 'నివాసాల మధ్య పిచ్చి మొక్కలు'వార్తకు అధికారులు స్పందించారు. బుధవారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ సిబ్బందితో వెళ్లి ఆయా చోట్ల పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో స్థానికులు శానిటరీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



విశాలాక్షినగర్‌లో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

వెలిగిన వీధిలైట్లు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో వీధి లైట్లను అధికారులు వెలిగించారు. వారం రోజుల పాటు ఆరిలోవ టీఐసీ పాయింట్, అంబేద్కర్ నగర్, జ్యోతినగర్, సుందరయ్య కాలనీ, పార్వతీనగర్, శ్రీకాంత్‌నగర్ తదితర కాలనీల్లో వీధి దీపాలు వెలిగించలేదు. దీంతో ఆయా కాలనీల్లో రాత్రుళ్లు చీకట్లు అలముకుని స్థానికులు ఇబ్బంది పడ్డారు. దీంతో పాటు బీఆర్‌టీఎస్ రహదారిలో కూడా లైట్లు వెలిగించకపోవడంతో అన్ని లైన్‌లు చీకటితో నిండిపోయాయి. ఈ సమస్యపై ఈ నెల 29న 'ఆరిలోవలో అంధకారం' అనేక శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనానికి జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు స్పందించారు. ఆయా కాలనీలలో వీధిలైట్లుం వెలిగించారు. అంతవరకు బాగానే ఉన్నా.. బీఆర్‌టీఎస్ రోడ్డులో మాత్రం ఇంకా చీకట్లే ఉన్నాయి. ఈ రహదాదిలో లైట్లు లేకపోవడంతో చీకటిలో వాహనాలు నడుపుతూ పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. అక్కడ కూడా విద్యుత్ లైట్లు వెలిగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.



ఆరిలోవ సుందరయ్య కాలనీలో వెలిగిన విద్యుత్ దీపాలు

అరుదైన క్యాన్సర్‌కు విజయవంతంగా శస్త్రచికిత్స


ఆరిలోవ: అరుదైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళకు హెల్త్‌సిటీ మెడికవర్ ఆస్పత్రిలో విజయవంతంగా శస్త్రచికిత్స చేసినట్లు సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ కార్తీక చంద్ర బుధవారం విలేకరులకు తెలిపారు. ఇటీవల సూడోమైక్సోమా పెరిటోనియ్‌తో బాధపడిన 58 ఏళ్ల మహిళ మెడికవర్ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించారన్నారు. ఆమెకు అవసరమైన పరీక్షలు జరిపించి వ్యాధి నిర్ధారణ చేసినట్లు చెప్పారు. ఇది అరుదైన పొత్తి కడుపు క్యాన్సర్‌గా గుర్తించినట్లు తెలిపారు. దీనికి సైటోరెడక్టివ్ సర్జరీతోపాటు హైపర్‌థెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కెమోథెరపీ నిర్వహించామన్నారు. అత్యాధునిక వైద్య పరీక్షలు, పద్ధతులు ఉపయోగించి డాక్టర్ లలిత, డాక్టర్ ప్రవీణ్, బృందంతో కలిసి తాను 12 గంటల పాటు శస్త్రచికిత్స చేసినట్లు వెల్లడించారు. ఇటువంటి అరుదైన శస్త్రచికిత్స విజయవంతం కావడానికి సహకరించిన మెడికవర్ అంకాలజీ వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రోగిని పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జి చేసినట్లు చెప్పారు.



క్యాన్సర్ చికిత్స చేయించుకున్న మహిళతో డాక్టర్ కార్తీక చంద్ర

పర్యాటకులకు సురక్షితమైన తాగునీరు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులో పర్యాటకుల సౌకర్యార్థం డీవీస్ లేబొరేటరీస్ రెండు ఆర్వో ప్లాంట్‌లను ప్రారంభించింది. కురుసుర మ్యూజియం, టీయు-142 యుద్ధ విమానం వద్ద ఏర్పాటు చేసిన ఈ యూనిట్లను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ పర్యాటకులకు సురక్షితమైన తాగునీటిని అందించడానికి డివీస్ యాజమాన్యం అందించిన సహకారం మరువలేనిదన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్, డివీస్ ప్రతినిధులు జీఎం వైఎస్ కోటేశ్వర రావు, సీఎస్సార్ మేనేజర్ డి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తదితరులు

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తం

మద్దిలపాలెం: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రా యూనివర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏయూ ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అంతర్జాతీయ సమస్యని, దీనిపై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా సమస్య సాంఘిక దురాచారమని, అందరూ అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మహమ్మద్ హుస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

విత్తన రాఖీల తయారీపై విద్యార్థినులకు అవగాహన



చిరుధాన్యాలతో రాఖీలు తయారు చేస్తున్న విద్యార్థినులు

ఎంవీపీకాలనీ: గ్రీన్ క్లైమేట్ టీమ్, వీఎంసీ కళాశాల, ఏపీ కాలుష్య నియంత్రణ మండలిల ఆధ్వర్యంలో బుధవారం ఎంవీపీ కాలనీ వీఎంసీ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు విత్తన రాఖీల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.వి.మురళీమోహన్ మాట్లాడుతూ ప్రకృతికి హాని కలిగించే చర్యలకు ప్రజలు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశీయ విత్తనాలతో రాఖీలు తయారు చేయడాన్ని విద్యార్థులకు నేర్పించడంపై గ్రీన్ క్లైమేట్ టీమ్‌కు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం స్వదేశీ విత్తనాలతో విద్యార్థినులు రాఖీలు తయారు చేశారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. చినవాల్తేరులో రెండో భార్య పూర్ణిమతో కలిసి నివసిస్తున్న సిడగం లక్ష్మణ్‌రావు(31) అనే వ్యక్తి మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న త్రీ టౌన్ ఎస్ఐ పి.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది లక్ష్మణ్‌రావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వంచనే బాబు అజెండా

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు
- 11వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



11వ వార్డులో మహిళకు కూటమి ప్రభుత్వం మోసాల గురించి వివరిస్తున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ: చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసగించారని, వంచనే బాబు అజెండా అని నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు విమర్శించారు. జీవీఎంసీ 11వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, స్థానిక కార్యకర్తలతో కలిసి మొల్లి అప్పారావు వార్డు పరిధి పార్వతీనగర్‌లో ఇంటింటికీ వెళ్లారు. కూటమి నాయకులు 2024 సాధారణ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం, సూపర్ సిక్స్ హామీలు పక్కన పెట్టడం తదితర వాటి గురించి ప్రజలకు వివరించారు. నివాసాలు, కిరాణా షాపులు, వ్యాపారుల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వ పాలనలో మోసాల గురించి ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి నాయకుల హామీలకు ప్రజలు మోసపోయారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విపరీతంగా చార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపారన్నారు. నియోజవర్గంలో వేల మంది పిల్లలకు తల్లికి వందనం వేయలేదన్నారు. రూ. 10 వేలు వేతం చెల్లిస్తామని చెప్పి వలంటీర్లుకు ఆశ చూపించి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారిని పట్టించుకోలేదన్నారు. ఇలాంటి మోసాలను ఎండగట్టి కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముగడ రమేష్, స్థానిక నాయకులు సూరిబాబు, బోని శ్రీనివాస్, అప్పలరాజు, మక్బుల్, మోహనరావు, షకీనా, విజయ, హేమంత్, జహింగీర్, శ్రీను, సతీష్, గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. దీంతో పాటు జీవీఎంసీ 10, 12, 13 వార్డుల్లో కూడా బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డుల్లో పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'నమ్మి ఓటేశాం.. దారుణంగా మోసపోయాం'



21వ వార్డులో ప్రజలకు కూటమి మోసాలను వివరిస్తున్న మొల్లి అప్పారావు



17వ వార్డులో కూటమి మోసాల కరపత్రం అందిస్తున్న మొల్లి అప్పారావు

బీచ్‌రోడ్డు: ఏ ఇంటికి వెళ్లి అడిగినా.. 'కూటమి నాయకులను నమ్మి ఓటు వేశాం. వారు దారుణంగా మోసం చేశారు' అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. పార్టీ 21వ వార్డు అధ్యక్షుడు మధుపాడ రవి ఆధ్వర్యంలో బుధవారం వార్డులోని 182, 184 బూత్‌ల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ ఆయన వెళ్లి చంద్రబాబు చేసిన మోసాల కరపత్రం అందించి వివరించారు. మైత్రినగర్‌లో కొన్నేళ్లుగా చిన్న చిన్న రేకుల షెడ్లలో నివసిస్తున్నామని, ఇక్కడ గత నాలుగు సార్లు గెలిచిన టీడీపీ ఎమ్మెల్యే.. శాశ్వత భవనాలు కట్టిస్తానని మాట ఇచ్చి, నాలుగు సార్లు మోసం చేశారని నివాసులు వాపోయారు. ఈ సారి కూటమికి ఓటమి చవిచూపించేందుకుగా ప్రజలు సిద్ధం కావాలని మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తూర్పు సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పిలక మధుసూదన రెడ్డి, విజయ్, రామకృష్ణ, అప్పలరాజు, సంగీతరావు, మహేష్, శ్రీకాంత్, జగదీశ్,చంద్రశేఖర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడపగడపకు కూటమి మోసాలు

ఎంవీపీకాలనీ: ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను గడపగడపకు వివరించాలని వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. పార్టీ 17వ వార్డు అధ్యక్షుడు నీలారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వార్డులో నిర్వహించిన బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి, కూటమి మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. హామీలను నెరవేర్చకుంటే ఊరుకునేది లేదంటూ కూటమి నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజుబాబు, వార్డ్ మహిళ అధ్యక్షురాలు, బూత్ కన్వీనర్ పిల్లా సత్యవతి, వార్డ్ పరిశీలకుడు నారాయణరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, లవణకుమార్, సూరాడ దాసు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు తరచూ ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలి

ఆరిలోవ: మహిళలు తరచూ ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని అపోలో అంకాలజీ వైద్యులు సూచించారు. బుధవారం అపోలో ఆస్పత్రిలో గర్భాశయ లోపలి పొర (ఎండోమెట్రియల్), అండాశయ(ఒవేరియన్) క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కోసం ప్రత్యేకంగా ఎండ్-ఒ చెక్ కార్యక్రమాన్ని అపోలో నూతన సీవోవో డాక్టర్ కృష్ణప్రసాద్ ప్రారంభించారు. దీని ప్రకారం రూ.2998 మహిళలకు గర్భాశయ లోపల పొర, అండాశయ క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు. ఈ సందర్భంగా అంకాలజీ వైద్య నిపుణులు డాక్టర్ సుమన్‌దాస్, డాక్టర్ సైదామణి, డాక్టర్ విజయ, డాక్టర్ ప్రదీప్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తించగలిగితే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చన్నారు. మహిళల్లో గర్భాశయ లోపలి పొర, అండాశయ క్యాన్సర్ వస్తుందన్నారు. 40 నుంచి 45 సంవత్సరాల మహిళల్లో అండాశయ క్యాన్సర్, 50 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసుగల మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఇది సైలెంట్ కిల్లర్‌గా మారుతుందన్నారు. దీనిపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ క్యాన్సర్ వచ్చే మహిళల్లో కడుపు ఉబ్బడం, పొత్తి కడుపులో నొప్పి రావడం, ఆహారం తినడానికి ఇబ్బంది కలగడం, మలబద్ధకం, బరువు తగ్గడం, సమయానికి రుతుస్రావం జరగకపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇలాంటి వారు ప్రారంభంలో చికిత్స పొందగలిగితే క్యాన్సర్ నుంచి బయటపడవచ్చని వైద్యులు సూచించారు.



ఎండోమెట్రియల్, ఒవేరియన్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల చార్ట్ ఆవిష్కరిస్తున్న అపోలో సీవోవో, అంకాలజీ వైద్యులు

బడుగుల జీవన పోరాటమే రావిశాస్త్రి రచనలు

ఏయూక్యాంపస్: కలమే ఆయుధంగా బడుగు బలహీన వర్గాల జీవన పోరాటానికి అక్షర రూపం ఇచ్చిన మహా మనీషి రాచకొండ విశ్వనాథ శాస్త్రి అని పలువురు కొనియాడారు. బుధవారం ఉదయం బీచ్ రోడ్డులో రాచకొండ విశ్వనాథ శాస్త్రి విగ్రహం వద్ద ఆయన జయంతి నిర్వహించారు. పలువురు రావిశాస్త్రి అభిమానులు, న్యాయవాదులు, కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్య నిపుణులు జి.రఘు రామారావు మాట్లాడుతూ రావిశాస్త్రి నవ సమాజ పద నిర్దేశకుడన్నారు. ఇల్లు, రత్తాలు-రాంబాబు వంటి రచనలు న్యాయ వ్యవస్థకు నిఘంటువుగా నిలిచి ఉన్నాయన్నారు. రాష్ట్ర బార్‌కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ మాట్లాడుతూ సాధారణ ప్రజల జీవితాలను కథలుగా చెప్పిన మహోన్నత వ్యక్తి రావిశాస్త్రి అన్నారు.

రావిశాస్త్రి కుమారుడు కుమార్ శాస్త్రి అధ్యక్షత వహించారు. పాండిచ్చేరి పూర్వ మంత్రి కృష్ణారావు రావిశాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె. శ్రీనివాస్, రచయిత డి.వి సూర్యారావు, న్యాయవాదులు కె.వి రామమూర్తి, కె.వి.నరసింహ మూర్తి, నమ్మి సన్యాసి రావు, చీమలపాటి శేఖర్, చింతపల్లి రాంబాబు, జీవర సత్యనారాయణ, వేదుల సోమేశ్వరరావు, రావిశాస్త్రి జూనియర్లు సంతోష్, సురేష్, సత్యనారాయణ, దీపక్, గోపాల్, పద్మజ తదిరతులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ..

రావిశాస్త్రి జయంతిని పురస్కరించుకుని బీచ్ రోడ్డులోని గాయత్రి విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి రావిశాస్త్రి విగ్రహం వరకు విద్యార్థులు ర్యాలీగా తరలి వెళ్లారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుర వాణి రావిశాస్త్రి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వేదుల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రావిశాస్త్రి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

రావిశాస్త్రికి నివాళి

సాహితీ తేజస్సు రావిశాస్త్రి అని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ అన్నారు. రావిశాస్త్రి జయంతి సందర్భంగా బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సామాజిక న్యాయం కోసం కలంతో పోరాడిన యోధుడిగా రావిశాస్త్రి నిలుస్తారన్నారు. న్యాయవాదిగానే కాకుండా న్యాయవాది పాత్రలను తన కథల్లో నిజంగా పోషించిన మహోన్నత వ్యక్తని దేవిశ్రీ కొనియాడారు.

అత్యంత ప్రతిభాశాలి రావిశాస్త్రి

మద్దిలపాలెం: సామాజిక చైతన్య మూర్తి రాచకొండ విశ్వనాథశాస్త్రి(రావిశాస్త్రి) జయంతి వేడుకలు బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రావిశాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావిశాస్త్రి తెలుగు సాహిత్యంలో ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించారని, తెలుగు రచయితల్లో అత్యంత ప్రతిభాశాలని కొనియాడారు. నవలాకారుడిగా, కథకుడిగా, న్యాయ కోవిదుడిగా, పీడిత జన పక్షపాతిగా పేరు పొందారన్నారు. ఈయన కథలు విశ్వవిద్యాలయ స్థాయిలో సిలబస్‌లో పెట్టారన్నారు. తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి రావిశాస్త్రి అని ఆచార్య జర్రె అప్పారావు కొనియాడారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ రావిశాస్త్రి మార్గం ఉన్నతమైనది, విలువైనదని, ప్రజలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తి బావి రచయితలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్.గిరీష్‌కుమార్, డాక్టర్ ఆర్.శివయ్య, డాక్టర్ ఎం.దాసు, డాక్టర్ బీర సూర్యనారాయణ, డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.కృష్ణవేణి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



రావిశాస్త్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ ఆచార్యులు అప్పారావు, సిమ్మన్న